మెనూ ప్రకారం భోజనం అందించాలి

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్, జూన్18: స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జైక్రాంతి, ఎంఈవో రాజగంగారెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, ఎస్‌వో ప్రగతి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీహరి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

అనుమతిలేని ప్రైవేట్ స్కూళ్లను సీజ్ చేయాలి

విద్యాశాఖాధికారిణికి వినతిపత్రం అందజేస్తున్న యూఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

ఖలీల్‌వాడి, జూన్ 18: జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సంజయ్ మాట్లాడుతూ..ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫామ్ అమ్మకూడదని ఉత్తర్వులు జారీ చేసినా యాజమాన్యాలు పట్టించుకోవడంలేదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. జిల్లా నాయకులు మంగేష్, శివరాజ్, మహేందర్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు సీజ్ చేయాలి

ఆర్మూర్‌టౌన్, జూన్18: పట్టణంలోని ఎంవీఐ వివేకానంద రెడ్డికి మంగళవారం పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఆసంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న స్కూల్ బస్సులను వెంటనే సీజ్ చేయాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని అన్నారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, స్కూల్ లైసెన్స్‌లను రద్దు చేయాలని కోరారు. అనుభవం ఉన్న డ్రైవర్లు స్కూల్ బస్సులు నడిపే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ఫాంపాండ్స్ పూర్తిచేయాలి

రుద్రూర్, జూన్18: మండల పరిధిలోని ప్రతి గ్రామంలో పది ఫాంపాండ్స్ నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంపీడీవో సురేశ్‌బాబు సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎఫ్ఏలు రాసే ఏడు రకాల రిజిస్టర్లతోపాటు నర్సరీకి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఏపీవో మనోహర్, ఎంపీవో సాయిలు పాల్గొన్నారు.

ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

మాధవ్‌నగర్ సొసైటీగోదాములోని ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న డీఏవో వాజిద్ హుస్సేన్

సారంగాపూర్, జూన్ 18: జిల్లావ్యాప్తంగా సొసైటీలు, డీలర్లు ఎరువులను ఈ-పాస్ ద్వారానే రైతులకు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ ఆదేశించారు. మంగళవారం ఆయన నిజామాబాద్ రూరల్ మండలంలోని మాధవ్‌నగర్, గుండారం, ముత్తకుంట, పాల్దా సొసైటీల్లో మండల వ్యవసాయాధికారి హీరాజా దవ్, సహకార శాఖ క్లస్టర్ ఆఫీసర్ మురళితో కలిసి ఆయన సందర్శించారు. విక్రయం కోసం అందుబాటులో ఉంచిన ఎరువుల నిల్వలను తనిఖీ చేసి పనులను పరిశీలించారు. ఈ-పాస్ ద్వారా ఎరువులను విక్రయించడం ద్వారా పారదర్శకత ఉంటుందని, ఎరువుల లారీ వచ్చిన వెంటనే బిల్లులను పీఓఎస్ యంత్రాల్లో నిక్షిప్తం చేయాలన్నారు. అమ్మిన ప్రతి బస్తా తాలూకు రైతు వివరాలను రికార్డుల్లో పొందుపర్చాలని సూచించారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరం మేరకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలని సొసైటీ సీఈవోలను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎరువులను అందించాలన్నారు. పంట సాగుకు వినియోగించే ఎరువులను విచ్చలవిడిగా వాడకుండా అవసరం మేరకు మాత్రమే వాడాల్సిన ఆవశ్యకతపై రైతులకు ఏఈవోలు అవగాహన కల్పించాలని సూచించారు. డీఏవో వెంట సొసైటీ చైర్మన్లు నాగేశ్వర్‌రావు, దాసరి శ్రీధర్, కౌలాస్ శ్రీనివాస్, పైసా స్వామి, ఏఈవోలు స్వాతిలత, జ్ఞానేశ్వర్‌రెడ్డి, రమాకాంత్, రాకేశ్, సొసైటీ సీఈవోలు నంబూద్రి పాగ్, అనంతలక్ష్మి, వంశీకృష్ణ, రాకేశ్ ఉన్నారు.

పల్లె దవాఖానలో మూడు పోస్టులు భర్తీ

దోమలెడ్గిలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మీర్జా హైమద్ బేగ్

కోటగిరి, జూన్ 18: ఉమ్మడి కోటగిరి మండలంలోని పల్లె దవాఖానలో కొంత కాలంగా ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను ఉన్నతాధికారులు ఎట్టకేలకు భర్తీ చేశారు. ఏడాదిన్నర నుంచి రోగులకు మెరుగైన వైద్యం అందక నానా ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం కోడ్ ముగిసిన తర్వాత ఉన్నతాధికారులు పొతంగల్ పీహెచ్‌సీ పరిధిలోని కొత్తపల్లి దోమలెడ్గి, రాణంపల్లిలోని పల్లె దవాఖానలో పోస్టులు భర్తీ చేశారు. కొత్తపల్లి పల్లె దవాఖానకు రమణి, దోమలెడ్గి పల్లె దవాఖానకు మీర్జా హైమద్ బేగ్, రాణంపల్లి పల్లె దవాఖానకు దీక్షితను నియమించారు.

వాహనాల వేలం..

ఎక్సైజ్ శాఖకు రూ.90,742 ఆదాయం

వినాయక్‌నగర్, జూన్ 18: అసెంబ్లీ ఎన్నికల వేళ వివిధ ఎక్సైజ్ నేరాల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలకు మంగళవారం వేలం నిర్వహించినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ నిజామాబాద్ ఇన్‌స్పెక్టర్ బి.దిలీప్ తెలిపారు. ఈ వేలంలో వ్యాపారులతోపాటు ఇతరులు పాల్గొని, రూ.90,742 చెల్లించి వాహనాలు సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వేలం కోసం ఉంచిన వాహనాల ధర రూ.44,500 నిర్ణయంచగా.. రెట్టింపు ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు మల్లేశ్, సుష్మిత, సింధుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ

నేడు హిందూ సామ్రాజ్య దినోత్సవం

సుభాష్‌నగర్, జూన్ 18: జిల్లా కేంద్రంలోని పులాంగ్‌లో ఉన్న శ్రీ విజయలక్ష్మీ గార్డెన్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7 గంటలకు హిందు సామ్రాజ్య దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు నగర ప్రతినిధి శ్రీనివాస్ పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఆర్డీవో వెంకటయ్య, వక్తగా వరంగటి శ్రీనివాస్ తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

మానసిక ప్రశాంతతకు 'యోగ'

సుభాష్‌నగర్, జూన్ 18: తనువు, మనస్సు, ఆత్మను ఏకం చేసే సాధనం యోగ అని, మానసిక ప్రశాంతతకు నిత్యం యోగా చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. తిలక్‌గార్డెన్‌లో వాసవీ క్లబ్ సీనియర్ సిటిజన్స్, వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులకు మంగళవారం ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఉచిత యోగ సెంటర్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణ

భీమ్‌గల్, జూన్ 18: మండలంలో ఐదెకరాలలోపు అనువైన భూమి కలిగి ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగియున్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటలు పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు ఫారంను సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌కు గానీ గ్రామపంచాయతీ కార్యదర్శిగానీ వ్యవసాయ సహకార అధికారికి గానీ ఉద్యానవన అధికారికి గాని సమర్పించాలని సూచించారు. ఉపాధిహామీ పథకం కింద మామిడి, నిమ్మ, నారింజ, జీడిమామిడి, జామ, సీతాఫలం, సపోటా ఆయిల్ పామ్ నేరేడు ఆపిల్ బేర్, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి మొక్కలు పెంచవచ్చని, రెండేండ్లపాటు నిర్వహణ ఖర్చులతోపాటు ఉపాధిహామీ నిధులతో మొక్కలు నాటించనున్నట్లు తెలిపారు.

లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

భీమ్‌గల్, జూన్ 18: మండలంలోని లింబాద్రి లక్ష్మీనర్సింహా స్వామిని మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సమావేశమైన స్వర్ణకారులు

భీమ్‌గల్, జూన్ 18: స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో నిరాహార దీక్ష చేస్తున్న కొండోజు నర్సింహాచారికి మద్దతుగా పట్టణ స్వర్ణకార వ్యాపార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దకాణాల బంద్ పాటించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సుంకం నర్సయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ దీక్షకు సంఘీభావంగా మండలంలోని స్వర్ణకార షాపులు బంద్ పాటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు గణిత్ శ్యామ్, వేణు గంగాధర్, శివ, రమేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొలతల్లో తేడాలపై అధికారుల ఆగ్రహం

సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న అధికారులు

మోర్తాడ్, జూన్18: కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. డీఆర్‌డీవో సాయన్న హాజరై నివేదికను పరిశీలించారు. ఈనెల7 నుంచి 17 వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన రూ.3కోట్ల16లక్షల పనులపై ప్రజావేదిక నిర్వహించారు. పలు గ్రామాల్లో కొలతల్లో తేడాలు రావడంతో కూలీలకు ఎక్కువ డబ్బులు చెల్లించిన విషయంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నాటిన మొక్కల్లో 60 శాతం కూడా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. 60 శాతానికి తగ్గకుండా మొక్కలు నాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గౌతమీ సుమన్, ఎస్ఆర్‌పీ సురేందర్, డీవీవో నారాయణ, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, ఏపీవో విద్యానంద్, డీఆర్వీలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇంటింటా మిషన్ భగీరథ నల్లాల సర్వే

కోటగిరిలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ఏర్గట్ల/ కోటగిరి/బోధన్‌రూరల్, జూన్ 18: ఏర్గట్ల మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న మిషన్ భగీరథ నల్లాల సర్వేను ఎంపీవో శివచరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ కుళాయిల సర్వేను నీర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ సర్వేను నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆయన సూచించారు. ఏర్గట్లలో నిర్వహిస్తున్న సర్వేలో పంచాయతీ కార్యదర్శి జాకీర్ తదితరులు పాల్గొన్నారు.కోటగిరిలో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీవో మనోహర్‌రెడ్డి పరిశీలించారు. ఇంటింటికీ భగీరథ నీళ్లు సక్రమంగా వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ముజబూర్‌బేగ్‌తో మాట్లాడారు. భగీరథ నీరు వాడుతున్నారా లేదా? వాడకపోతే ఎందుకు వాడడం లేదు అనే విషయాలను సేకరించాలని సూచించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో మారుతి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.బోధన్ మండలంలోని భూలక్ష్మిక్యాంప్, పెగడపల్లి గ్రామాల్లో బోధన్ ఎంపీవో మధుకర్ సిబ్బందితో కలిసి మిషన్ భగీరథ నల్లాల సర్వే చేశారు. కార్యక్రమంలో గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

టీయూ విద్యార్థికి డాక్టరేట్

డిచ్‌పల్లి, జూన్ 18 : టీయూ తెలుగు విభాగంలోని పరిశోధక విద్యార్థి జి.ప్రసాద్ డాక్టరేట్ సాధించారు.సీనియర్ ఆచార్యులు అయాచితం నటేశ్వర శర్మ పర్యవేక్షణలో 'జిల్లా పరమాధిక్ సాహిత్యం – సమగ్ర పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేయగా..డాక్టరేట్ ప్రకటించారు.

రైలు ప్రమాదంలో కూలీ దుర్మరణం

నవీపేట, జూన్ 18: మండలంలోని ఫకీరాబాద్ రైల్వేగేటు వద్ద సోమవారం రాత్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని దినసరి కూలీ మృతి చెందాడు. బాసర రైల్వేహెడ్ కానిస్టేబుల్ జానీ, స్థానికుల కథనం ప్రకారం.. ఎడపల్లి మండలం ఠాణాకలాన్ గ్రామానికి చెందిన దినసరి కూలీ బోర్గగాడి సాయిలు(47) అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు కూలీలతో పెంకుటిండ్లు కప్పడానికి మూడు రోజుల క్రితం రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి వచ్చారు. సోమవారం ఓ పెంకుటిల్లు ఉరుపులు కప్పి అదే రాత్రి తోటి కూలీలతో కలిసి ఫకీరాబాద్ గ్రామానికి సేద తీరేందుకు వచ్చి మద్యం తాగారు. తిరుగు ప్రయాణంలో తాడ్‌బిలోలి వెళ్తుండగా ఫకీరాబాద్ రైల్వే గేటు మూసి ఉంది. మద్యం మత్తులో ముగ్గురు కూలీలు గేటు కింది నుంచి రైల్వే లైన్‌ను క్రాస్ చేసి వెళ్లారు. సాయిలు సైతం గేటు కింది నుంచి రైల్వే లైన్ దాటే ప్రయత్నం చేయగా అదే సమయంలో వచ్చిన నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలుఢీకొట్టింది. సాయిలు మృతదేహం ముక్కలై దూరంగా పడి పోయింది. మృతుడి తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేహెడ్ కానిస్టేబుల్ జానీ పేర్కొన్నారు.

23న రక్తదాన శిబిరం

సుభాష్‌నగర్, జూన్ 18: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఇందూరు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్ గీతా భవనంలో ఈనెల 23న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్ దేశ్‌ముఖ్, కార్యదర్శి రొట్టె సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 25 మంది రక్తదాతలు ముందుకు వచ్చారని, ఆసక్తి ఉన్న వారు 9440020231 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

మోర్తాడ్, జూన్ 18: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని దళిత సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లూరి రాజారాం, జాంభవ, గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యమకారులను గుర్తించి వారికి జీవనభృతి కల్పించాలని, ఉచిత వైద్యం అందించడంతో పాటు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సీనియారిటీ ప్రకారం ఉద్యోగోన్నతులు కల్పించాలి

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

భీమ్‌గల్, జూన్ 18: సీనియారిటీ ప్రకారం ఉద్యోగోన్నతులు కల్పించాలని సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్‌జీటీలు) డిమాండ్ చేశారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రం(ఎంఆర్‌సీ) వద్ద మంగళవారం వారు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, పీడీ, పీఎస్ హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల్లో అర్హత ఉన్న ఎస్‌జీటీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. న్యాయం చేయాల్సిన మాతృ సంఘాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేడని అన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరిగేలా చూడాలని, లేకపోతే ఉపాధ్యాయ సంఘాల సభ్యత్వానికి రాజీనామా చేసేందుకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎం.వాసుదేవ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వి.లక్ష్మీనారాయణ, ఎం.ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్, చంద్రదేవ్, రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాస్, ప్రవీణ్, మండల అసోసియేట్ అధ్యక్షుడు శేఖర్, చంద్రశేఖర్, దినేశ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ప్రదీప్, హరికృష్ణ పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలోని శ్రీ విజయసాయి జూనియర్ కళాశాలలో 2005-2007లో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు తమ గురువులతో కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. శ్రీ విజయసాయి విద్యాసంస్థల డైరెక్టర్ ఆర్.కామశాస్త్రిని, నాటి అధ్యాపకులను సత్కరించారు.

– బోధన్, జూన్ 18

బాలుర వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్పల్లి/సిరికొండ, జూన్ 18: ధర్పల్లి, సిరికొండ మండల కేంద్రాల్లోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతిగృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వసతిగృహ సంక్షేమాధికారులు సాయికుమార్, సాయికిరణ్ తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. 5వ తరగతి నుంచి పదో తరగతి చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఎటువంటి రాతపరీక్ష లేకుండా నేరుగా వసతిగృహాల్లో ప్రవేశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.దరఖాస్తు చేసుకునే వారు కులం, ఆదాయం, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 7997802943, 9493927414 నంబర్లను సంప్రదించాలని ధర్పల్లి వార్డెన్ సూచించారు.

'ఫ్రంట్ వారియర్స్' లోగో ఆవిష్కరణ

లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ గోపి

ఇందల్వాయి, జూన్ 18 : మండలంలోని నల్లవెల్లి గ్రామ యూత్ వారియర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్ యూత్ లోగోను మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి ఆవిష్కరించారు. గ్రామంలో సేవా కార్యక్రమాలు, ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకరావడానికి యూత్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు యూత్ అధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. తాము ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. నల్లవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు రోహిత్, హరీశ్ పాల్గొన్నారు.

రేపు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

బోధన్ ఆర్డీవోకు వివరాలు వెల్లడిస్తున్న వైద్యశాఖ అధికారులు

బోధన్, జూన్ 18: నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు అధికారులు సహకరించాలని బోధన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య రాన్‌వాల్‌కర్, పాన్‌గల్లీ పీహెచ్‌సీ వైద్యాధికారి సమత కోరారు. బోధన్ పట్టణంతోపాటు డివిజన్‌లో ఏడాది నుంచి 20 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూశాఖ, మున్సిపల్ అధికారులు సహకరించాలని కోరుతూ మంగళవారం సదరు అధికారులు ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణతో పాటు పలువురు కౌన్సిలర్లను కలిసి వివరించారు. ఈనెల 20న ఏడాది నుంచి రెండేళ్ల మధ్య వయస్సు కలిగిన చిన్నారులకు సగం మాత్ర, మిగతా వారందరికీ ఒక మాత్ర వేయిస్తామని అధికారులు వెల్లడించారు. బోధన్ పట్టణంతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించామన్నారు. మాత్రల పంపిణీకి వచ్చే సిబ్బందికి అందరూ సహకరించాలని డాక్టర్లు కోరారు. వీరివెంట పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారిణి నిర్మల, హెచ్‌ఈవోలు ఉన్నారు.

కోటగిరి, పొతంగల్‌లో నేడు అవగాహన ర్యాలీ

కోటగిరి/పొతంగల్, జూన్ 18: ఈ నెల 20న నేషనల్ డీవార్మింగ్ డేను పురస్కరించుకొని ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11గంటలకు కోటగిరి మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. పొతంగల్ పీహెచ్‌సీ విస్తరణ అధికారి గోవర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న అన్ని పాఠశాలలు, కళాశాలల్లో 1-19 ఏండ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ నెల 20, 27వ తేదీల్లో నులి పురుగు నివారణ మాత్రలను పంపిణీ చేస్తామని తెలిపారు. ఒకటి నుంచి 19 ఏండ్లలోపు పిల్లకు తప్పకుండా మాత్రలు వేయించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత బాల్కొండ

విజేత జట్టుకు బహుమతిని అందజేస్తున్న అతిథులు

బాల్కొండ, జూన్ 18: మండల కేంద్రంలో కొద్ది రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్ బాల్కొండ-కొత్తపల్లి జట్ల మధ్య జరిగింది. విజేతగా నిలిచి మొదటి బహుమతిని గెలుపొందిన బాల్కొండ జట్టుకు 21 వేల నగదుతో పాటు కప్‌ను, రన్నర్‌గా నిలిచిన ద్వితీయ బహుమతి కొత్తపల్లి జట్టుకు రూ.11 వేల నగదుతో పాటు కప్‌ను ఏఎస్సై రాజేశ్వర్‌రెడ్డి అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బాల్కొండ జట్టుకు చెందిన రమేశ్ కైవసం చేసుకున్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ తబ్రేస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా నర్సారెడ్డి కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇష్తేకారుద్దీన్, కోఆప్షన్ మెంబర్ ఫయాజ్‌అలీ, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గాండ్ల రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కో